ప్రచురణ తేదీ : 10-12-2020 రచయిత పేజీని సమర్పించినవారు:


# చివుకుల శ్రీలక్ష్మి


## ప్రాణ స్నేహితుడా!

ప్రియమైన ప్రాణ స్నేహితుడా!

నేను...... నా పేరు వింటేనే నీకు పట్టరాని నవ్వు వచ్చేది కదా! అర్థమైంది కదా! అందుకే నా పేరు అడుగున సంతకం దగ్గరే రాస్తున్నాను. నీకు ఈ లేఖ ఎందుకు రాస్తున్నానో తెలుసా? మనం చిన్నప్పుడు ఎప్పుడో రెండేళ్ళు కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత వేరైపోయాం.

అవును! మా పార్వతీపురం ఐ.టి.డి.ఎ. కు మీ నాన్న పెద్ద ఆఫీసర్ గా వచ్చారు. అక్కడ గిరిజన పాఠశాలలోనే నువ్వు కూడా చేరావు. మా అందరికీ ఆశ్చర్యమే! అంత పెద్ద ఆఫీసర్ గారి అబ్బాయి మాతో ఉండడమా? అని. నువ్వు దొరబాబు లాగా ఉండే వాడివి. మేమంతా కొండ జాతోళ్ళం. మోటుగా నల్లగా ఉండే వాళ్ళం. ఇంకా ఆ నల్లని కొండ చాయ్ తాగి తాగి మా పెదవులూ, పళ్ళూ కూడా నల్లగా ఉండేవి. నీతో మాట్లాడాలి అంటే మాకు జంకుగా ఉండేది. కానీ నువ్వు మాత్రం మా అందరితో కలిసిపోయి చనువుగా ఉండేవాడివి. మనిద్దరం స్నేహితులుగా ఒక ఏడాది గడిపాం. తరువాత నేనే ఒకరోజు నిన్ను అడిగాను. మనం నేస్తం కడదామా? అని. నీకు అర్థం కాలేదు.

మా సవరలతో నేస్తం కట్టడమంటే దానికో పద్ధతి ఉంది. అది నీకు వివరంగా చెప్పగానే వెంటనే మరో ఆలోచన లేకుండా నువ్వు అంగీకరించావు.

ఒక మంచి రోజు చూసి నేను కుండెడు తేనె, అరటి పండ్లు గెల, పసుపు కొమ్ములు, నాలుగు కొండ చీపుళ్ళు, మండిగ నిండా జొన్నలు, అల్లం, పొగాకు తీసుకుని నేస్తం కట్టడానికై మీ ఇంటికి వచ్చాను. నువ్వు నన్ను ఆదరించి కుర్చీలో కూర్చోబెట్టావు.

నువ్వు ఆ కానుకలను అందుకుని ప్రతిగా ఒక ఎరుపు రంగు తలపాగనూ, రెండు ఫలాలనూ, తవ్వెడు బియ్యం, పసుపు కొమ్మూ, అల్లం ముక్క, పానకం, రెండు పొగాకు చుట్టలూ నాకు అందించావు. తరువాత చీపురుపుల్లలు తీసుకుని గడీ ఇషాన్, గడీసం అని మూడుసార్లు అనుకుని చీపురు పుల్లలు ఒకరి చేతినుండి మరొకరు మార్చుకుని రెండేసి ముక్కలు చేసి పార వేశాం. సవర భాషలోని

ఆ మాటలకు "నా స్నేహితుడా! నీ స్నేహితుడను!" అని అర్థం.

చీపురు పుల్లలు విరిచి పారెయ్యడం ప్రమాణం చేయడంగా భావిస్తారు.

ఆ విధంగా మనమిద్దరం నేస్తం కట్టడం వలన నీవు మా సవర భాష నేర్చుకుందికీ, మా సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకుందికీ అవకాశం ఏర్పడింది.

ఒక ఏడాది పాటు ఇద్దరం ఒకే కంచం ఒకే మంచంగా తిరిగాం.

ఈ ఏడాదిలో సవర భాష నేర్చుకోవడం ఎట్లా ఉన్నా మా సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునే ప్రయత్నాలు బాగా చేసావు.

మా కొండదేవతల జాతరలు, సిరిమాను అధిరోహించడాలూ, తుడుము, మోరి, డోలు, కిరిడి, డప్పు, బాకా, జోడు కొమ్ములు, సన్నాయి, కొమ్ముబూర, పిస్సలగర్ర, మొదలగు వాయిద్యాలతో ఊరేగింపు వెళుతూ ఉంటే వెనుక ఘటాలు తలకెత్తుకున్న నాయిరాళ్ళు నడకలతో వెన్నంటి వచ్చే పేరంటాళ్ళుకు పూనకం వచ్చి ఊగిపోతూ ఏదేదో మాట్లాడేస్తూ ఉంటే... ఉత్సుకతతో మెరిసే కళ్ళతో నువ్వు చూస్తూంటే నేను నిన్నూ, నీ కళ్ళలోని మెరుపునూ చూసేవాడిని.

నేస్తమా! గుర్తుందా?

జాతరలో మనిద్దరం కలిసి పచ్చబొట్లు పొడిపించుకున్నాము. నీ పేరు నా చేతిపైన నా పేరు నీ చేతిపైన. ఇద్దరం చేతులు పక్కపక్కన పెట్టుకుని చూస్తూ ఉంటే కళ్ళలో నీళ్ళు పెదవులపై నవ్వుల వెన్నెలలు.

చెరువు గట్టుపై షికారు వెళ్ళినపుడు నీకు తినడానికి ఒకటి ఇచ్చాను. ఏమిటంటావా? అభ్యూపబాదిక! అదేనయ్యా! లేత జొన్న కంకులు నన్నని పెగుమీద కాల్చి బెల్లంతో కలిపి తినడమే! ఆకలిగా ఉందేమో నీకు భలే నచ్చింది కదా!

ఎన్నని గుర్తు చేయను మిత్రమా!

మా గిరిజన స్త్రీలు చేసే థింసా నృత్యం నీకు చాలా నచ్చేది. మగవాళ్ళూ వాద్యపరికరాలు ఊదుతూ ఉంటే ఆడవాళ్ళు సుమారు 30 మంది ఒకరి నడుము చుట్టూ మరొకరు చేయి వేసుకుని లయబద్ధంగా కదులుతూ అడుగేస్తుంటారు. సాధారణంగా థింసా నాట్యం చూసేవారికి ఒకేలాగా అనిపిస్తుంది కానీ దీనిలో సందర్భాన్ని బట్టి వేరే వేరే పేర్లతో పిలుస్తారు.

పండుగలలోనూ, పెళ్ళి వేడుకల్లోనూ థింసా నాట్యం తప్పనిసరిగా చేస్తారు.

మిత్రమా! సాయంత్రం పూట అందరం ఆరుబయలు జాగాలో చేరి ఒక గంట సేపు నాట్యం చేసేవారం.

ఆ పాట గుర్తుందా?

"హోరె హోరె మోరోలో లారిలోహిరిలోరె ఝూలోయ్ ఝుంగాదోలి

మట్టి తిటి పాదం పాదోర్ చిట్టా కొండి నెలాటి జీజంత దుఃఖ దెలమొత్తా"

దీని అర్థం విశ్వసంలో దేవుడు ఉండి మనకు సుఖదుఃఖాలు కలుగచేస్తాడని. ఎంత అద్భుతమైన భావన!

ఒకరోజు పిడుగులాంటి వార్త! మీ నాన్నగారికి ట్రాన్స్ఫర్ అయిందని.నువ్వు వెళ్ళిపోతున్నావంటే నా మనసు ఎంత రోదించిందో మా పెరటిలోని చింతచెట్టుకీ, చెట్టుకి కట్టిన బకరీకే తెలుసు.

నువ్వు వెళ్ళి పోయాక చాలా రోజులు పిచ్చోడిలా తిరిగాను. స్నేహం కూడా ఒక బంధమే! మైత్రీ బంధం.

మిత్రమా!

నీకు తెలుసు కదా మా ఇంటి పరిస్థితి. అమ్మా, అయ్యా కూలిపనికి పొలానికో, రాళ్ళు కొట్టడానికి క్వారీకో పోతారు. ఊళ్ళో ఉన్న పదో తరగతి వరకే తప్ప పై చదువు మాట ఎత్తితే అమ్మా అయ్యా ఏడుస్తారు.

ఇంకేం చేస్తాం? అందుకే

రోజూ మన జట్టుగాళ్ళందరం వ్యాయామశాల కమ్యూల షెడ్ లో ప్రాక్టీస్ చేసేవాళ్ళం కదా! అంతేకాక రోజూ కొండలెక్కి, దిగి లోయలంబడి నడుస్తూ దేహాన్ని దృఢంగా ఉంచుకోగలిగాం. అందువలన మిలటరీ సెలక్షన్స్ లో ఎక్కువ మంది ఎంపికయ్యాము. మిగిలిన వారు కూడా మళ్ళీ సంవత్సరం నెగ్గేస్తారు.

చుట్టు పక్కల తండాల్లో గల అమ్మాయిలు

"వీరపుత్రుని వరింతుమయ్యా! వీరపత్నిగ గర్వింతుమయ్యా!"

అని పాడుకుంటూ మన ఊరి అబ్బాయిలనే మనువాడాలని ఉత్సాహపడతారు తెలుసా?

నేస్తమా!

నా ఆకాంక్ష నీకు విన్నవించుకుంటున్నాను. ఆలోచించు.

ఏడాదికోరోజు పువ్వుగుచ్ఛంతో నివాళి కాదు మేము కోరేది.

నిత్యం మీ తలపులలో మేముండాలి.

ఎపుడో వచ్చే యుద్ధం కోసం జవానులపై ఇంత ఖర్చా?? అని హేళన చేసే అజ్ఞానులున్న దేశమిది.

మాకిక్కడ రోజూ యుద్ధమేనని తెలియపరచు.

దేశాన్ని దృఢంగా ఉంచేందుకు తుప్పు పట్టకుండా యుద్ధపరికరాల్ని,

దేహాన్ని దృఢంగా ఉంచేందుకు వ్యాయామాలు, విన్యాసాలు అనవరతం చేస్తూనే ఉంటాం.

దేశంకోసం ఎర్రటి ఎండల్లో ఇసుక ఎడారుల్లో పహారా కాస్తున్నాం.

దేశప్రజలు కోసం గడ్డ కట్టించే చలిలో హిమశిఖరాలలో రేయీ పగలూ తేడా తెలియక తుపాకీ గుర్రపై పెట్టిన వేయిని దింపం.

ఏ శిఖరాలు విరిగిపడినా వాటికింద మేమే! కంటినిండా నిద్రించి ఎన్నాళ్ళైందో? అమ్మ చేతి ముద్ద తిని ఎన్నేళ్ళయిందో??

శత్రువు విజృంభిస్తాడనే ఊహకే ఆకలిదప్పులు దరిచేరవు. నా దేశంకోసం నా ప్రజలందరి రక్షణ కోసం ఈ జవాను దుస్తులతో చేసిన ప్రతిన మా చెవుల్లో మార్మోగుతూనే ఉంది. మావి కష్టాలని భయపడవద్దు. జాలి చూపవద్దు. జై భారత్! నినాదాలతో విచ్చే మా నెత్తుటి సువాసనలు దేశమంతా ఆఘ్రాణించాలి.

నువ్వు కూడా కలెక్టర్ అయ్యే ఉంటావు. దేశాన్ని శత్రువులు నుండి మేము కాపాడుతూంటే దేశంలోని ధనమూ, మేధాసంపత్తి విదేశాలకు పోతోంది. నీలాంటి చదువుకున్న వారే వారికి అవగాహన కల్పించగలరు.

ఆఖరుగా ఈ లేఖ రాయడం నిన్ను ఒకటి అడగాలని.

మన ఊరి చుట్టూ ఉన్న కొండలలో మైకా గనులున్నాయని త్రవ్వేస్తున్నారు. కొండలే లేకుంటే మా కొండజాతులు అంతరించిపోవా??

మేమేం చేశాము?? ప్రశాంతమైన జీవనం కోరుకున్నాము. ఆ త్రవ్వకాలలో ఎంతో మంది మనవాళ్ళు గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం

---

ఒక ఆఫీసరుగా నీకు చేతనైనది చేయి. మా కోసం మాట్లాడే ఒక గొంతు ఉందని ప్రపంచానికి తెలియని!

మిత్రమా!

నేను విధినిర్వహణలో ఉండగా తీసిన ఫోటో పంపిస్తున్నాను. పోల్చుకోలేవనుకో! అయినా మన ఊరి అబ్బాయిలు అందరినీ అందులో చూసుకో! డ్యూటీ లేనప్పుడు మీలాంటి స్నేహితులకు లేఖలు రాసుకుంటూ సమయం గడుపుతాం.

ఉంటాను మిత్రమా! నువ్వు కూడా అన్ని వివరాలతో పెద్ద లేఖ రాయి.

ఇట్లు నీ

ప్రాణస్నేహితుడు.

సున్నా

https://telugu.pratilipi.com/read/%E0%B0%AA%E0%B1%8D%E0%B0%B0%E0%B0%BE%E0%B0%A3-%E0%B0%B8%E0%B1%8D%E0%B0%A8%E0%B1%87%E0%B0%B9%E0%B0%BF%E0%B0%A4%E0%B1%81%E0%B0%A1%E0%B0%BE-99whjbop5wb0-48g2531159gvm07